సాక్షి నాగర్‌కర్నూల్

బుధవారం । 4 । జూన్ । 2025



బాస్కెట్‌బాల్ టోర్నీ

పాలమూరులోని మెయిన్ స్టేడియంలో బాస్కెట్‌బాల్ టోర్నీ ప్రారంభం కానుంది.

వివరాలు 8లో ▸



6 యూనిట్లలో విద్యుదుత్పత్తి

జూరాల జల విద్యుత్ కేంద్రాల్లోని ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తి చేపడుతున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.6 /21.9

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోత పెడుతుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కందనూలు: బెస్ట్ అవైలబుల్ **పాఠశాలలో** ప్రస్తుత విద్యా సంవత్సరానికి గా**ను 1 నుంచి** 5 తరగతుల్లో ప్రవేశాల కోసం జి**ల్లాలోని ఎస్సీ** విద్యార్థులు దరఖాస్తు చేసుకో**వాలని జిల్లా** షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి **రాంలాల్** మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల వారు రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారు రూ.1.50 లక్షలు మించకూడదన్నారు. 1వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థులు దరఖాస్తుతోపాటు 2 పాస్ ఫొటోలు, కులం, ఆదాయం, స్థానికం, జననం (1.06.2019 నుంచి 31.05.2020) మధ్య జన్మించిన ధ్రువపత్రాలతోపాటు ఆధార్, రేషన్‌కార్డుపై గెజిటెడ్ అధికారి సంతకం తప్పనిసరి ఉండాలన్నారు. 5వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థులు 4వ తరగతి బోనోఫైడ్‌తోపాటు ఇతర ధ్రువపత్రాలు జతపరుచుకొని ఈ నెల 16 సాయంత్రం 5 గంటల వరకు తమ కార్యాలయంలో అందజేయాలని కోరారు.


మతోన్మాద విధానాలపై సమరశీల పోరాటాలు



కల్వకుర్తి రూరల్: దేశంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అబ్బాస్ అన్నారు. మంగళవారం కల్వకుర్తిలోని యూటీఎఫ్ భవనంలో నిర్వహించిన సీపీఎం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహిస్తామన్నారు. మతం పేరుతో రాజకీయ లబ్ధి పొందడమే కాకుండా ప్రజా సమస్యలను తీర్చకుండా దేశాన్ని బడా కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. దేశాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నడుపుతున్నారా లేక అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పరిపాలిస్తున్నాడో అర్థం కావడం లేదన్నారు. పాకిస్తాన్, భారత్ యుద్ధాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు పదే పదే ప్రకటిస్తున్న దేశ ప్రధాని ఆ మాటలను ఖండించకపోవడం ఆక్షేపణీయమన్నారు. పాకిస్తాన్ మతోన్మాద చర్యలను అణచివేసేందుకు అన్ని పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి మద్దతు తెలిపిన అమెరికా అధ్యక్షుడి ఆదేశాలతో యుద్ధం ముగించడం దుర్మార్గమన్నారు. ఉగ్రవాదుల చేతిలో మరణించిన కుటుంబాలను పరామర్శించే సమయం లేని ప్రధానమంత్రి ఎన్నికలు జరిగే బీహార్‌లో మాత్రం సుడిగాలి పర్యటనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికలపై ఉన్న ప్రేమ ప్రధానికి దేశ ప్రజలపై లేదని ఆయన విధానాల వల్లే అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు, కార్యదర్శివర్గ సభ్యుడు ఆంజనేయులు, శ్రీనివాస్, మల్లయ్య, పరశురాములు, బాలస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేతన వెతలు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెలల తరబడి అందని జీతాలు



'నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. వీరికి ఇచ్చే అరకొర జీతాల్లోనూ సంబంధిత ఏజెన్సీ కోతలు విధిస్తోందని, మూడేళ్లుగా పీఎఫ్ జమ చేయకుండా తిప్పలు పెడుతున్నారని పలువురు ఉద్యోగులు జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.'

'వనపర్తి జిల్లాలో వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధిత ఏజెన్సీ పీఎఫ్ చెల్లించడం లేదు. నిబంధనల మేరకు ఉద్యోగులకు సంబంధిత ఏజెన్సీ సంస్థనే నెలనెలా పీఎఫ్ సొమ్మును వారి ఖాతాలో జమచేయాలి. కానీ ఏళ్లుగా ఏజెన్సీ సంస్థలు ఆ పని చేయడం లేదు. పర్యవేక్షించాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.'

- వచ్చే అరకొర వేతనాల్లోనూ కోత పెడుతున్న వైనం
- ఏళ్ల తరబడి పీఎఫ్ జమచేయని ఏజెన్సీలు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఉమ్మడి జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖలో 1,633 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు



నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రి

సాక్షి, నాగర్‌కర్నూల్: నిరుద్యోగుల ఆశలను ఆసరాగా చేసుకుని ఉమ్మడి జిల్లాలోని పలు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు అడ్డగోలుదందాకు పాల్పడుతున్నాయి. ఓ వైపు ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకొని అరకొర జీతాలతో వారితో పని చేయించుకుంటుండగా, సంబంధిత ఏజెన్సీలు వాటిల్లోనూ కోతలు పెడుతున్నాయి. నిబంధనల మేరకు నెలనెలా దక్కాల్సిన పీఎఫ్ సొమ్మును జమచేయకుండా అందినకాడికీ దండుకుంటున్నాయి. నెలల పాటు జీతాలు రాక, వచ్చే జీతంలోనూ కోతలతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అల్లాడుతున్నారు. పలు మార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

లంచం ఇస్తేనే జీతాలు..

మెడికల్ కళాశాలలు, జనరల్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధిత ఏజెన్సీలు సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీరికి జీతాలు ఇవ్వాలంటే సంబంధిత ఏజెన్సీకి అందులో కొంతమొత్తాన్ని ముట్టజెప్పాల్సి వస్తోందని చెబుతున్నారు. కనీసం మూడు నుంచి ఆరు నెలల వరకు జీతాలు పెండింగ్‌లోనే ఉంచుతున్నారని, అందులోనూ పెద్ద ఎత్తున కోతలు విధిస్తున్నారని ఔట్ సోర్సింగ్ సిబ్బంది వాపోతున్నారు.

నియామకాల సమయంలో వసూళ్లు..

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, జనరల్ ఆస్పత్రులు, నర్సింగ్ కళాశాలలు, వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోని పలు టెక్నికల్ ఉద్యోగాలను నియమిస్తున్న పలు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు యథేచ్ఛగా దందాలకు పాల్పడుతున్నాయి. తాత్కాలిక ఉద్యోగాలైనా ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు వసూళ్లకు పాల్పడుతున్నాయి. ప్రస్తుతం తాత్కాలిక పద్ధతిలో తీసుకుంటున్న ఉద్యోగాలు భవిష్యత్‌లోనూ పర్మినెంట్ అవుతాయని మభ్యపెడుతూ అందినకాడికి దండుకుంటున్నాయి.

మితిమీరుతున్న ఏజెన్సీ సంస్థల ఆగడాలు..

ఉమ్మడి జిల్లాలోని మెడికల్, నర్సింగ్ కళాశాలలు, **జనరల్** ఆస్పత్రులు, వైద్య, ఆరోగ్య **శాఖలో ఉద్యో**గులను ప్రభుత్వం ఎక్కువగా **ఔట్‌సోర్సింగ్** పద్ధతిలో నియమించుకుంటోంది. **వీరిని** నియమించుకుని, జీతాలు ఇచ్చే **బాధ్యతను** ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు అప్పగించింది. నిబంధనల ప్రకారం సరైన మ్యాన్ పవర్ సామర్థ్యం, ఎంప్యానల్‌మెంట్ ఉన్న వారికి మాత్రమే పనులను అప్పగించాల్సి ఉంది. చాలాచోట్ల ఇష్టారీతిన ఏజెన్సీలకు పనులు అప్పగించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చే జీతాన్ని సంబంధిత ఏజెన్సీలు వారి ఖాతాల్లో జమ చేస్తాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ఇచ్చేదాని కన్నా తక్కువ మొత్తంలో జీతాలను ఇస్తున్నారు. నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో ఉంటుండటంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అల్లాడుతున్నారు. నెలల తరబడి పీఎఫ్‌ను ఉద్యోగుల ఖాతాల్లో జమచేయకుండా ఏజెన్సీలు సొమ్ము చేసుకుంటున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ చేపట్టాం. ఇప్పటికే సంబంధిత ఏజెన్సీకి నోటీసులు జారీచేశాం. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– రవికుమార్, ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ, నాగర్‌కర్నూల్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వైద్య, ఆరోగ్య శాఖలో సేవలందిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

జిల్లా	ఉద్యోగులు
మహబూబ్‌నగర్	423
నాగర్‌కర్నూల్	350
జోగుళాంబ గద్వాల	310
వనపర్తి	290
నారాయణపేట	260

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు



మాట్లాడుతున్న హౌసింగ్ ఎండీ పీవీ గౌతం, పక్కన కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండీ పీవీ గౌతమ్ అన్నారు. మంగళవారం జిల్లాలో ఎంపిక చేసిన పైలెట్ ప్రాజెక్టు గ్రామాలు, వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలోని 20 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలనేది ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రామ కమిటీలు గుర్తించిన వారితోపాటు ఎవరైనా నిరుపేదలు ఉంటే పూర్తి వివరాలు తీసుకొని ఇళ్లు మంజూరు చేయాలన్నారు. గ్రామాలు, వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తుందన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన గ్రామాలు, వార్డుల్లో లక్ష్యం మేరకు నిర్మాణాలు పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలో యువ వికాసం ద్వారా సెంట్రింగ్, ఇటుకల తయారీ యూనిట్ల స్థాపనకు కృషి చేయాలని, తద్వారా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు యూనిట్లు నెలకొల్పే యువకులకు మంచి లాభదాయకంగా ఉంటుందన్నారు. గ్రామాల్లో ఎవరూ పూరి గుడిసెల్లో నివాసం ఉండకూడదనే సంకల్పంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో రెండో దశలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఈ నెల 9లోగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం లబ్ధిదారులకు ఈ నెల 6 వరకు మంజూరు పత్రాలు అందజేయాలన్నారు. అంతకు ముందు వారు నాగర్‌కర్నూల్ మండలంలోని గగ్గలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి రూ.5 లక్షలతోనే మంచి ఇంటిని నిర్మించుకోవచ్చని చెప్పారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, హౌసింగ్ పీడీ సంగప్ప, డీఆర్‌డీఓ చిన్న ఓబులేసు, డిప్యూటీ సీఈఓ గోపాల్‌నాయక్, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం భూ భారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం నాగర్‌కర్నూల్ మండలంలోని వెంకటాపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆగస్టు 14లోపు భూ భారతిలో వచ్చిన అన్ని అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. నిర్ణీత షెడ్యూల్‌ను అనుసరిస్తూ గ్రామాల్లో అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ సూచించారు.

ప్రజా ప్రభుత్వంలో ఎన్నో మార్పులు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి, పక్కన ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: ప్రజా ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలనలో భాగంగా ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టం భూ భారతి అమలు చేస్తోందని, అలాగే ప్రజా ప్రభుత్వంలో ఎన్నో మార్పులకు శ్రీకారం చుట్టిందని ఎంపీ మల్లురవి అన్నారు. మంగళవారం మండలంలోని పులిజాలలో నిర్వహించిన భూ భారతి సదస్సును ఆయన స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. భూ భారతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకే ప్రత్యేకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఏడాదిలోపు భూ ప్రక్షాళన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించడంతోపాటు సర్వేయర్ల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. లక్షలాది సంఖ్యలో ఉన్న ధరణి సమస్యలతోపాటు ఇతర భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలన్నారు. కొత్త రెవెన్యూ చట్టం భూ భారతిపై అవగాహన కల్పించడంతోపాటు పైసా ఖర్చు లేకుండా భూ సమస్యల తక్షణ పరిష్కారానికి సదస్సు వేదిక కానున్నాయన్నారు. రెవెన్యూ వ్యవస్థలో చోటుచేసుకున్న తప్పులను సరిచేసి, భూ పరిపాలనను సదస్సుల ద్వారా ప్రజల వద్దకే తీసుకెళ్తున్నామన్నారు. భూ భారతి చట్టంతో 18 రకాలైన భూమి మ్యుటేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా ఎన్నికై అచ్చంపేటకు తొలిసారి వచ్చిన మల్లురవికి ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్డీఓ మాధవి, తహసీల్దార్ సైదులు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, ఉమామహేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన్ టైం పరీక్ష రాసే అవకాశం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు ఉన్న విద్యార్థులకు వన్‌టైం పరీక్ష రాసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల కోర్సు, అదనంగా రెండు సంవత్సరాల గ్రేస్ పీరియడ్ కలిగి ఉండాలని, బ్యాక్‌లాగ్ ఉన్న విద్యార్థులకు ఇది చివరి అవకాశం అని, ఈ నెల 16వ తేదీ లోగా ఎలాంటి జరిమానా లేకుండా దరఖాస్తులు చేసుకోవాలని, 20వ తేదీ వరకు జరిమానాతో ఫీజుచెల్లించి, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఐటీఐలో ప్రవేశాలు

కందనూలు: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాల కోసం 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఆర్ఐటీఐ మన్ననూర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు https:iti.telangana.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం సెల్ నంబర్లు 94921 82944, 99517 07945లను సంప్రదించాలని సూచించారు.

పట్టణ ప్రణాళిక ఖరారు

- మున్సిపాలిటీలలో వందరోజుల కార్యాచరణ చేపట్టనున్న అధికారులు
- ప్రజా సమస్యలు, వానాకాలం యాక్షన్ ప్లాన్ కలిపి అమలు
- ఇకనైనా పట్టణాల్లో సమస్యలు తీరేనా..?



కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంకు ఎదురుగా ఇళ్ల మధ్య ఉన్న మురుగు ఇది. దీని గురించి ఎన్నోసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. అలాగే గతంలో చేపట్టిన పట్టణ ప్రగతిలోనూ తొలగని ఈ మురుగు.. ప్రస్తుతం చేపడుతున్న వందరోజుల ప్రణాళికలోనైనా తొలగిస్తారో.. లేదోనని స్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీల్లో మౌళిక వసతులు, ప్రజా సమస్యల పరిష్కారం, దీర్ఘకాలికంగా నెలకొన్న ప్రజా అవసరాలను తీర్చేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ రూపొందించింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సోమవారం నుంచి వందరోజులపాటు ఒక్కో కార్యక్రమం చేపట్టేలా తీర్మానించింది. ఇందులో ప్రజా అవసరాలు, వారి సమస్యల దృష్ట్యా ఒక్కో సమస్యను తీర్చేందుకు వాటి సామర్థ్యాన్ని బట్టి కొన్ని రోజులు అదే పనికి ప్లాన్‌లో రోజులను కేటాయించారు. ఇలా వందరోజుల యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగా ఇప్పటికే జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల్లో వార్డు అధికారులకు బాధ్యతలు కేటాయించి, క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను నోట్ చేసుకునేలా పురమాయించారు. ఆయా వార్డుల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించి వాటిని పూర్తిస్థాయిలో తీర్చేలా బడ్జెట్ కేటాయించి పనులు పూర్తిచేసేలా చూడనున్నారు.

రోజుల వారీగా పనులు

ప్రభుత్వం చేపట్టిన వందరోజుల ప్రణాళికలో 60 రోజులు, 30 రోజులు, వారం రోజులు ఇలా పనిని బట్టి రోజులను అధికారులు నిర్దేశించారు. ఇందులో వందరోజులలో ప్రతిరోజు చేపట్టే కార్యక్రమాల్లో భాగంగా మున్సిపాలిటీలో పరిశుభ్రత, వ్యర్థాలను వేరు చేయడంపై స్థానిక వార్డులలో ప్రచారం నిర్వహించాలి. సాలిడ్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్‌లో సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం, ఉత్తమ పద్ధతులను ప్రోత్సహించేలా చేయాలి. వ్యర్థాల విభజన, పరిశుభ్రత, ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణ, పరిశుభ్రత, వ్యర్థాల విభజనపై ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించాలి. కంపోస్టును ఉత్పత్తి చేయడానికి సేంద్రియ వ్యర్థాలను కంపోస్టు చేసేలా ప్రోత్సహించాలి. మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత, వ్యర్థాల విభజన, ప్రజారోగ్యం గురించి అవగాహన కల్పించడానికి ప్రత్యేకంగా స్టాళ్లు ఏర్పాటు చేయాలి. నూతన ఎస్‌హెచ్‌జీలను ఏర్పాటు చేయడం, అర్హత కలిగిన వారికి బ్యాంకు లింకేజీ స్కీంలను ఎస్‌హెచ్‌జీలకు అందించాలి. మున్సిపాలిటీలలో ఒకే వ్యాపారాన్ని నిర్వహిస్తున్న వారిని గుర్తించి వారికి రుణాలు అందేలా చూడాలి. రానున్న వానాకాలానికి సంబంధించి తాగునీరు కాలుష్యం కాకుండా క్లోరినేషన్ ప్రక్రియ చేపట్టాలి.

■ ప్రతిరోజు చేపట్టే కార్యక్రమాలే కాకుండా ఎంపిక చేసిన రోజులలో మున్సిపాలిటీలో చెట్లు నాటడం, వాటిని సంరక్షించేలా జూలై మొదటి మా సంలో వనమహోత్సవం ఏర్పాటు చేయాలి. చిన్నపిల్లలు, యువకులకు పర్యావరణ అవగాహనతోపాటు వారిని ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమా లు చేపట్టాలి. వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్‌లో భాగంగా అన్ని వార్డులలో కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఆర్ డబ్ల్యూహెచ్ వ్యవస్థను పటిష్టపరచాలి. ఏబీసీ సెంటర్ల నిర్వహణతోపాటు వీధి కుక్కలకు 100 శాతం స్టెరిలైజేషన్ చేయాలి. మున్సిపాలిటీల్లోని నాలాలలో చెత్త పడకుండా మెష్‌ను ఏర్పాటు చేయాలి.

సమస్యలు తీరేనా...?

మున్సిపాలిటీలలో గత ప్రభుత్వం చేపట్టిన పట్టణ ప్రగతిలో చాలావరకు సమస్యలు పరిష్కారమవుతాయని అప్పటి ప్రభుత్వ పెద్దలు, మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పినా అది మాత్రం కార్యాచరణలో కనపడలేదు. ప్రస్తుత ప్రభుత్వం అదేరీతిలో వందరోజుల ప్రణాళిక పేరుతో కార్యక్రమాన్ని రూపొందించినా అది అలా కాకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. వార్డులలో దీర్ఘకాలికంగా సమస్యలు వేధిస్తున్నా గెలిపించిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా వాటి పేరుతో పబ్బం గడిపారని విమర్శలు ఉన్నాయి. ఏదేమైనా పట్టణ ప్రణాళికలో భాగంగా వార్డులలో చేపట్టే పనులను పూర్తి శ్రద్ధతో చేసి, ప్రజా సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సిబ్బందిని సమాయత్తం చేశాం



పట్టణ ప్రణాళికలో భాగంగా వందరోజుల యాక్షన్ ప్లాన్‌కు తగ్గట్టుగా మున్సిపాలిటీలలో వార్డు ఆఫీసర్లు, ఇతర సిబ్బందిని సమాయత్తం చేశాం. యాక్షన్ ప్లాన్‌లో సూచించిన విధంగా ఒక్కో పనిని ఆయా వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది చేపట్టి, ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే నోట్ చేసుకుంటారు. ప్రజా సమస్యల పరిష్కారం, వాటి అమలుపై రోజువారీ రిపోర్టులను సైతం తయారు చేస్తాం.

– మహమూద్ షేక్, మున్సిపల్ కమిషనర్, కల్వకుర్తి

సీఎంఆర్ అప్పగిస్తే ధాన్యం కేటాయింపు

- ప్రైవేట్ వడ్లు మిల్లింగ్ చేస్తే చర్యలు
- పౌర సరఫరాలశాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్ చౌహాన్



మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్ చౌహాన్

వనపర్తి: డిఫాల్ట్ మిల్లర్లు బకాయి ఉన్న సీఎంఆర్ అప్పగించి నిజాయతీగా ముందుకొస్తే సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని.. ధాన్యం కేటాయింపులు చేపడతామని పౌరసరఫరాలశాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్ చౌహాన్ తెలిపారు. మంగళవారం జిల్లాలో పర్యటించిన అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లుతో కలిసి వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల పౌరసరఫరాలశాఖ అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కష్టపడి పండించిన ధాన్యం మిల్లులకు అప్పగిస్తే పద్ధతి ప్రకారం నిల్వ చేయకుండా బయట గుట్టలుగా పడేసి తడిసిపోయిందని, సీఎంఆర్ ఇవ్వమని చెప్పడం క్షమార్హం కాదని, ప్రభుత్వం కేటాయించిన ధాన్యం తీసుకోకుండా ప్రైవేట్‌గా వడ్లు తీసుకొని మిల్లింగ్ చేసే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. రెండు జిల్లాల్లో సగానికిపైగా మిల్లర్లు డిఫాల్ట్ జాబితాలో ఉండటం ఏమిటని విస్మయం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలులో రాష్ట్రంలో ఎక్కడా లేని సమస్యలు ఇక్కడే ఎందుకు ఉత్పన్నమవుతున్నాయని ప్రశ్నించారు. తాత్కాలికంగా గోదాముల్లో ధాన్యం నిల్వ చేసినప్పటికీ అంతిమంగా తిరిగి మిల్లులకు చేరాల్సిందేనని స్పష్టం చేశారు. మిల్లర్ల సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం మిల్లుకు రాకపోవడంతో క్వింటాకు 67 కిలోలు రావాల్సిన బియ్యం 62 కిలోలే వస్తున్నాయని, తద్వారా మిల్లర్లు నష్టపోతున్నారని వివరించారు. ఎఫ్ఏక్యూ ప్రకారం ధాన్యం రావడం లేదని చెప్పడం సరికాదని, తేమ శాతం వచ్చాకే తూకం చేసి మిల్లులకు పంపిస్తున్నామన్నారు. వరి కోత యంత్రాలు 18 నుంచి 20 ఆర్పీఎం, గేర్ స్టాట్ బి–1లో ఉంచడం, బ్లోయర్ ఆన్‌లో పెట్టుకొని పంట కోతలు చేపట్టేలా చూడాలని, నిబంధనలు పాటించని యజమానులపై కేసులు నమోదు చేయాలని పోలీస్‌శాఖను ఆదేశించారు. వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. పదేళ్లలో ఏ యాసంగిలో రానంత దిగుబడి ఈసారి జిల్లాలో పండిందని తెలిపారు. ఇప్పటి వరకు 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.571 కోట్లు 39,145 మంది రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. మరో 20 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉందని తెలిపారు. జిల్లాలో 184 మిల్లులు ఉండగా.. డిఫాల్ట్ మిల్లులుపోను కేవలం 77 మిల్లులకు మాత్రమే ధాన్యం కేటాయించినట్లు వివరించారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్ అమరేందర్, వనపర్తి డీఎస్ఓ కాశీవిశ్వనాథ్, డీఎంలు, ఆయా ప్రాంతాల కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామ శివారులో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ మహేష్ వివరాల ప్రకారం పంట పొలాల్లో దుస్తులు లేని వ్యక్తి మృతదేహం కన్పించిందని తెలిపారు. ఐడీ కార్డులు, ఎటువంటి గుర్తులు లేకపోవడంతో మృతదేహాన్ని అలంపూర్ ఆస్పత్రిలోని మార్చురికి తరలించారు. ఎవరైన గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అప్పు ఇచ్చినోళ్లకు కుచ్చుటోపి

అయిజ: చిరు వ్యాపారాల పేరుతో అనేక మందితో అప్పులు చేసిన ఓ వ్యక్తి కనిపించకుండా పోయాడు. వివరాల్లోకి వెళ్తే.. అయిజకు చెందిన ఓ వ్యక్తి కొన్నేళ్లుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ తెలిసిన వారితో వడ్డీకి అప్పు తీసుకున్నాడు. కొంతకాలం పాటు అప్పు ఇచ్చిన వారికి వడ్డీతో సహా అసలు చెల్లించి నమ్మకం పెంచుకున్నాడు. ఈ క్రమంలో సుమారు రూ. 3కోట్ల మేర అప్పుచేసిన అతడు.. కుటుంబ సభ్యులతో సహా ఇక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో అప్పు ఇచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు. పది రోజుల క్రితం పట్టణంలో ఓ చిరువ్యాపారి సుమారు రూ. కోటి అప్పు చేసి ఐపీ పెట్టిన ఘటన మరువకముందే మరో వ్యక్తి అదే బాటలో నడవడం చర్చనీయాంశంగా మారింది. అదే విధంగా గతేడాది ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో ఓ వ్యక్తి వడ్డీ వ్యాపారుల నుంచి సుమారు రూ. 50కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేశాడు. రెండేళ్ల క్రితం స్వీట్ హౌస్ నడుపుకుంటున్న వ్యాపారి రూ. కోటికి పైగా అప్పులుచేసి పరారు కావడాన్ని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. వరుస ఘటనలతో అప్పులు ఇచ్చేందుకు ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సిన అవసరం ఏర్పడింది.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం



లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో షార్ట్‌సర్క్యూట్‌తోపూరి గుడిసె దగ్ధమైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పూర్ణకంటి దేవయ్య పని నిమిత్తం గుడిసెకు తాళం వేసి భార్య, కూతురుతో కలిసి పొలానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగి గుడిసెకు నిప్పు అంటుకొని పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో వంటసామాగ్రి, దుస్తులు, తిండి గింజలు, వ్యవసాయ పనులకు కోసం ఉంచుకున్న డబ్బులు కాలిపోయాయి. దాదాపుగా రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

నేటినుంచి బాస్కెట్‌బాల్ టోర్నీ



ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అసోసియేషన్ సభ్యులు

- ఔట్ డోర్, ఇండోర్ స్టేడియంలో మ్యాచ్‌లు
- హాజరుకానున్న 20 జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రం రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు వేదికకానుంది. మెయిన్ స్టేడియంలో నేడు (బుధవారం), గురువారం మొదటి రాష్ట్రస్థాయి అండర్–23 విభాగం (3x3) పురుషుల, మహిళా అంతర్ జిల్లాల చాలెంజర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ జరగనుంది. ఈ పోటీలకు రాష్ట్రంలోని 20 జిల్లాల పురుషుల, మహిళా జట్లు పాల్గొంటున్నాయి. ఆయా జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు, 50 మంది అధికారులు హాజరవుతున్నారు. టోర్నీలో పాల్గొనే పురుషులకు లిటిల్ స్కాలర్స్ స్కూల్, మహిళలకు చైతన్య స్కూల్, ఇండోర్ స్టేడియంలో వసతి సౌకర్యం ఏర్పాటు చేశారు. ఇండోర్ స్టేడియంలో భోజన వసతి కల్పించనున్నారు.

> **విజయవంతంగా నిర్వహిస్తాం..**
>
> 
>
> జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ నిర్వహిస్తున్నాం. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. అందరి సహకారంతో రాష్ట్రస్థాయి టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తాం. గత ఏడాది ఆగస్టు చివరివారంలో రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ టోర్నీని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాం.
>
> – మక్సూద్‌బిన్ అహ్మద్ జాకీర్, అధ్యక్షుడు, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్, మహబూబ్‌నగర్

లీగ్ కం నాకౌట్ మ్యాచ్‌లు...

టోర్నీలో లీగ్‌కం నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. దాదాపు 75 లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఔట్ డోర్, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో పగలు, సాయంత్రం ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు జరగనున్నాయి. బుధవారం ఉదయం 12 గంటలకు స్టేడియంలో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ ప్రారంభం కానునుంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర క్రీడావ్యవహారాల సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. మంగళవారం ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లను జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్, నసరుల్లా హైదర్ పరిశీలించారు. కార్యక్రమంలో మీర్ ఖాలెద్‌అలీ, సుబాన్‌జీ, మహ్మద్ ఇలియాజ్, గోపాలకృష్ణ, ఫారుఖ్ ముకర్రం, షకీల్, వినోద్‌కుమార్, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధమైన ఇండోర్ స్టేడియం

మహబూబ్‌నగర్ జట్టు: అలీ అబ్దుల్ బాసిత్, జి.రోహిత్, టి.వివేక్, ఎస్.ఆదిత్య నారాయణ్, భువనేశ్వరి, పి.అర్పిత, ప్రియాంక, స్టాండ్‌బై భాను, తనుశ్రీ.

పెద్ద ధన్వాడలో గందరగోళం



ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రోడ్డుపై బైఠాయించిన రైతులు

- ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా నినాదాలు
- పోలీసుల జోక్యంతో శాంతించిన రైతులు

రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడ శివారులో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు, ప్రజలు మంగళవారం ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. పెద్ద ధన్వాడ శివారులో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ ఫ్యాక్టరీ సిబ్బంది మంగళవారం కంటైనర్, ఇతర సామగ్రిని ఫ్యాక్టరీ స్థలం వద్దకు తీసుకొచ్చారు. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా బయటకు రాగా.. రైతులు, స్థానికులు వెంటనే గ్రామస్తులకు సమాచారం అందిస్తూ అక్కడకు చేరుకున్నారు. ఫ్యాక్టరీ పనులు చేపడుతున్నారని, దాని కోసం ప్రైవేట్ సైన్యాన్ని తీసుకొస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా విషయం తెలుసుకున్న సీఐ టాటా బాబు, ఎస్ఐ జగదీశ్ అక్కడకు చేరుకుని రైతులు, ఫ్యాక్టరీ సిబ్బందితో మాట్లాడారు. ఫ్యాక్టరీ సిబ్బంది తమ స్థలానికి హద్దులు ఏర్పాటు చేసుకోవడంతో పాటు, సిబ్బంది ఉండేందుకు కంటైనర్ ద్వారా షెల్టర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పనులు ప్రారంభించడం లేదని తెలిపారు. పోలీసులు విషయాన్ని రైతులకు తెలియడంతో పాటు ధర్నాలు చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దని విజ్ఞప్తి చేయడంతో వారు ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తొందర్లోనే తమ కార్యాచరణ సిద్ధం చేసి, ఇథనాల్ కంపెనీ వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా ఫ్యాక్టరీ అంశంపై కలిసి రావాలని సోషల్ మీడియా ద్వారా ప్రజలు కోరుతున్నారు.

దేశం తరఫున ఆడటం జిల్లాకే గర్వకారణం



మహబూబ్‌నగర్ క్రీడలు: అనన్యశ్రీ అంతర్జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తుండడం ఉమ్మడి జిల్లాకే గర్వకారణమని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎస్‌పీ వెంకటేశ్ అన్నారు. మక్తల్‌కు చెందిన అనన్యశ్రీ వియాత్నంలో ఈనెల 7 నుంచి 14 వరకు జరిగే ఆసియా వాలీబాల్ పోటీలకు ఎంపికకావడంపై ఆమె తల్లిదండ్రులు పి.ఆనంద్, వరలక్ష్మిలను మంగళవారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ వాలీబాల్‌లో అనన్యశ్రీని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. ఆమె గతంలో చైనాలో జరిగిన వరల్డ్ యూనివర్సిటీ పోటీల్లో ఆడడం సంతోషంగా ఉందన్నారు. మరింత మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, జిల్లా వాలీబాల్ సంఘం ప్రతినిధులు చెన్న వీరయ్య, గులాం దస్తగిర్‌ఖాన్, జిల్లా కబడ్డీ సంఘం ఉపాధ్యక్షులు దామోదర్‌రెడ్డి, జిల్లా యోగా సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బిందె నీటి కోసం 2 కి.మీ. నడవాల్సిందే



కొత్తపాలెం తాండాలో వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుటంన్న జనం

మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామాల్లో తాగు నీటి కోసం జనం నానా తంటాలు పడ్డారు. మండల పరిధిలోని కొత్తపాలెం తండాలో 5 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో తండా వాసులు 2 కి.మీ దూరంలో ఉన్న వ్యవసాయ బోరు వద్దకు కాలి నడకన వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తండాలో ప్రతి 15 రోజులకు ఒక సారి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని మహిళలు పేర్కొంటున్నారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరా సక్రమంగా నిర్వహించి తమ సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. మండల పరిధిలోని జూరాల వద్ద ఉన్న మిషన్ భగీరథ హెడ్ వర్క్స్‌లో సంపుల క్లీనింగ్‌లో భాగంగా మంగళవారం జిల్లాలోని అన్ని మండాల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ధరూరులో కూడా నీటికష్టాలు మొదలవడంతో జనం ఏకంగా మిషన్ భగీరథ ట్యాంకు ఎక్కి నీటిని తెచ్చుకునే ప్రయత్నం చేశారు. అందులోనూ నీళ్లు లేకపోవడంతో కిందికి దిగిపోయారు. ప్రాణాలకు తెగించి మరీ ఇలా ట్యాంకులు ఎక్కిన మహిళల ఫోటోలు సామాజిక మాద్యమాల్లో వైరల్ అయ్యాయి.

– ధరూరు



ధరూరులో మిషన్ భగీరథ ట్యాంకు ఎక్కిన మహిళలు

వివాహేతర సంబంధం అంటగట్టాడని..

- ఆటో డ్రైవర్‌ను హత్య చేసిన తోటి ఆటో డ్రైవర్
- నిందితుడితో పాటు అతడికి సహకరించిన వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు
- రిమాండ్‌కు తరలింపు

చౌటుప్పల్ రూరల్: వివాహేతర సంబంధం అంటగట్టి పరువు తీశాడని ఆటో డ్రైవర్‌ను హత్య చేసిన తోటి ఆటో డ్రైవర్‌ను, అతడికి సహకరించిన మరో వ్యక్తిని మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన మారోజు రమేష్(33) బతుకుదెరువు నిమిత్తం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌లోని చంపాపేట పరిధిలోని దోబీఘాట్ ప్రాంతానికి వలస వచ్చాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న రమేష్ నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలం అంతంపేటకి చెందిన లెంకలపల్లి భాస్కర్ వద్ద ఆటోను రోజువారీగా అద్దెకు తీసుకుని నడిపేవాడు. రమేష్ పలుమార్లు ఆటోతో ప్రమాదాలు చేసి తీసుకురావడంతో పాటు దానికి రిపేర్‌కు అయ్యే ఖర్చులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడు. ఈ క్రమంలో భాస్కర్ డబ్బుల కోసం రమేష్ ఇంటి వద్ద లేని సమయంలో అతడి ఇంటికి వెళ్లి గొడవ చేసేవాడు. తాను ఇంటి వద్ద లేని సమయంలో భాస్కర్ ఇంటికి రావడంతో తన భార్యతో వివాహేతర సంబంధం నడుపుతున్నాడనే అనుమానంతో రమేష్ ఆటో అడ్డా వద్ద తోటి డ్రైవర్లకు భాస్కర్ గురించి తప్పుగా చెప్పేవాడు. రమేష్ తనకు ఇచ్చే డబ్బులు ఇవ్వకపోగా.. తన పరువు తీసేలా వివాహేతర సంబంధం అంటగట్టడంతో రమేష్‌పై భాస్కర్ కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా రమేష్‌ను హత్య చేయాలని భావించి హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ ప్రాంతంలోని గుంటి జంగయ్య కాలనీకి చెందిన మరో ఆటో డ్రైవర్ ఎండీ రియాజ్ సహకారంతో రమేష్‌ను గత నెల 25న ఎల్‌బీనగర్‌కు పిలిపించాడు. ముగ్గురు కలిసి మద్యం తాగారు. అనంతరం అక్కడి నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట గ్రామ పరిధిలోని గ్రీన్ సిటీ వెంచర్‌లోకి వచ్చి అక్కడ కూడా మద్యం తాగారు. ఈ సమయంలో భాస్కర్, రమేష్ మధ్య మాటామాట పెరిగింది. దీంతో భాస్కర్, ఎండీ రియాజ్ అక్కడే ఉన్న ఉల్లిపాయల బస్తాతో రమేష్‌కు ఉరి వేసి హత్య చేశారు. అనంతరం రమేష్ ముఖంపై బండరాళ్లతో మోదారు. రమేష్ మృతి చెందాడని నిర్ధారించుకుని అక్కడి నుంచి ఎల్‌బీనగర్‌కు వెళ్లిపోయారు. గ్రీన్ సిటీ వెంచర్‌లో గత నెల 30న వ్యక్తి మృతదేహం లభ్యం కావడంతో చౌటుప్పల్ పోలీసులు గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మృతదేహం లభ్యమైన ప్రదేశానికి వెళ్లి పోలీసులు ఆధారాలు సేకరిస్తుండగా.. భాస్కర్, ఎండీ రియాజ్ అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని పట్టుకుని విచారించగా.. హత్య చేసింది తామేనని నిజం ఒప్పుకున్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

హమాలీ కాలనీలో మొసలి సంచారం



తాళ్లతో బంధించిన మొసలి

గద్వాల క్రైం: గద్వాల పట్టణంలోని హమాలీ కాలనీలో మొసలి కలకలం సృష్టించింది. కాలనీ వాసుల కథనం మేరకు.. మంగళవారం తెల్లవారు జామున మొసలి సంచారిస్తుండగా కుక్కలు గుర్తించి వెంటపడ్డాయి. దీంతో కాలనీ వాసులు నిద్ర లేచి చూడగా మొసలి ఇళ్ల మధ్యలోకి వచ్చింది. వెంటనే దానిని అతి కష్టం మీద తాళ్లతో బంధించారు. ఉదయమే ఆటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు అక్కడికి చేరుకుని మొసలిని జూరాల ప్రాజెక్టు నీళ్లలో విడిచి పెట్టారు. జూరాల ప్రాజెక్టుకు ఇటీవల ఎగువ ప్రాంతం నుంచి భారీ ఎత్తున వరద జూరాలకు చేరడంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేసిన క్రమంలో కుడి కాలువ మీదుగా మొసలి సమీపంలో జమ్ములమ్మ రిజర్వాయర్ ఉండడం, చుట్టూ పరిసర ప్రాంతాల్లో నీటి మడుగులు ఉండడం ద్వారా మొసలి వచ్చి ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు.

మహబూబ్‌నగర్‌కు రెండో విజయం

మహబూబ్‌నగర్ క్రీడలు: అండర్–19 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు రెండు విజయాన్ని నమోదు చేసుకుంది. జిల్లాకేంద్రానికి సమీపంలోని సమర్థ స్కూల్ మైదానంలో మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ 10 వికెట్ల తేడాతో నాగర్‌కర్నూల్‌పై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన నాగర్‌కర్నూల్ 28.5 ఓవర్లలో 70 పరుగులకు ఆలౌట్ అయింది. మహబూబ్‌నగర్ బౌలర్లు అభినవ్ 3.5 ఓవర్లలో 7 పరుగులకు 2, ప్రణవ్ 5 ఓవర్లలో 8 పరుగులకు 2, యువన్ 4 ఓవర్లలో 13 పరుగులకు 2, నవీన్‌కుమార్ 5 ఓవర్లలో 13 పరుగులకు 2 వికెట్లు తీశారు. అనంతరం స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు 9.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 71 పరుగులు చేసింది. జట్టులో అబ్దుల్ రాఫే 36 బంతుల్లో 11 ఫోర్లతో 53 పరుగులు, కార్తీక్ 18 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు.

గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలి

క్రికెట్‌లో గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. గెలుపొందిన మహబూబ్‌నగర్ జట్టును అభినందించారు. ఓడిన జట్టు నిరాశచెందకుండా పట్టుదలతో ఆడి రానున్న మ్యాచుల్లో విజయం సాధించాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ క్రీడాకారులకు అండర్–19 లీగ్ ఒక వేదిక లాంటిదన్నారు. లీగ్‌లో క్రీడాకారులు ప్రతిభ చాటాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోచ్‌లు అబ్దుల్లా, ఎండీ మన్నాన్ పాల్గొన్నారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు/ ఆత్మకూరు/ రాజోళి/ దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గింది. సోమవారం ప్రాజెక్టుకు 24 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. మంగళవారం సాయంత్రానికి 17 వేల క్యూసెక్కులకు తగ్గినట్లు అధికారులు తెలిపారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 16,752 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 750, కోయిల్‌సాగర్‌కు 315 వదలగా.. 68 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.454 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

జల విద్యుత్ కేంద్రాల్లో మంగళవారం 6 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 3 యూనిట్ల ద్వారా 117 మెగావాట్లు, దిగువలో 3 యూనిట్ల ద్వారా 120 మెగావాట్లు ఉత్పత్తి సాధించామన్నారు. ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఇప్పటి వరకు 15.948 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు.

శ్రీశైలానికి 18,964 క్యూసెక్కులు

జూరాల, సుంకేసుల నుంచి కలిపి 18,964 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తుంది. ప్రస్తుతం శ్రీశైలంలో 833.2 అడుగుల వద్ద 52.8918 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గత 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 480 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 0.372 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసి 830 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 1.182 మి.యూనిట్లు ఉత్పత్తి చేసి 2,465 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు.



నెట్టెంపాడు ఎత్తిపోతల నీటి పంపింగ్

సుంకేసులకు స్వల్ప వరద

సుంకేసుల డ్యాంకు మంగళవారం స్వల్పంగా ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎగువ నుంచి 2,248 క్యూసెక్కులు రాగా.. ఒక గేటును తెరిచి అంతే స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేశారు. అలాగే కేసీ కెనాల్‌కు 159 క్యూసెక్కులు విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

పశువుల కంటైనర్ పట్టివేత



కంటైనర్ నుంచి పశువులను దింపుతున్న సిబ్బంది

అలంపూర్: పశువులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్‌ను పోలీసులు పట్టుకున్నారు. అతి క్రూరంగా పశువులను తరలిస్తుండటంతో కంటైనర్‌లోనే మూడు కోడెదూడలు, ఒక ఆవు మృత్యువాత పడ్డాయి. ఉండవెల్లి ఎస్ఐ మహేష్ వివరాల మేరకు.. అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద పశువుల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి సరిహద్దు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు చెక్‌పోస్టు వద్ద పోలీసులు, పశుసంవర్ధక శాఖ అధికారులు నిత్యం తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ కంటైనర్‌లో పశువులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన ఎండీ ఖలీల్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా కంటైనర్‌లో 48 కోడెదూడలు, 31 ఆవులు తరలిస్తుండగా.. పట్టుకొని గోశాలకు తరలించారు. కాగా, కంటైనర్‌లో పశువులు కదలకుండా గట్టిగా కట్టివేయడం.. నీరు, ఆహారం లేకుండా క్రూరంగా తరలిస్తుండటంతో అందులోనే మూడు కోడె దూడలు, ఒక ఆవు మృతిచెందాయి. పట్టుబడిన పశువుల విలువ రూ. 6,75,000 ఉంటుందని ఎస్ఐ తెలిపారు. పశువులను అక్రమంగా తరలిస్తున్న ఎండీ ఖలీల్, కంటైనర్ డ్రైవర్ అబ్దుల్ అజీజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.